# జోర్డాన్, ఈజిప్ట్ ట్రావెలాగ్

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి



*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

**22.10.15**

ఆరు గంటలకి లేచి తయారై ఏడుం పావుకి బ్రేక్ ఫాస్ట్‌కి వెళ్ళాం. అక్కడున్న వెజిటేరియన్ పదార్థాలు ఫ్రైడ్ జుకునీ (కీరాలాంటిది) వంకాయ, ఫలాఫెల్, బేక్‌డ్ పొటాటో, పచ్చి ఖర్జూరాలు, తాగడానికి లెమన్, హైబిస్కస్, ఆరెంజ్ జ్యూస్, టీ, కాఫీ, డిజర్ట్‌గా కేంటలోప్ ఫ్రూట్, టొమేటో, కేరట్ ముక్కలు, స్థానిక ఛీజ్.

ఎనిమిదికల్లా లాబీలోకి వెళ్ళాం. అప్పటికే గైడ్ తారిఖ్ అక్కడ మా కోసం వేచి ఉన్నాడు. అంతా వచ్చాక ఉదయం ఎనిమిది ఇరవైకి పిరమిడ్స్ చూడడానికి బయలుదేరాం. దారిలో తారిఖ్ పిరమిడ్స్ గురించి వివరించాడు.

"నైలు నదికి తూర్పు వైపు కైరో, పశ్చిమం వైపు గీజా పిరమిడ్స్ ఉన్నాయి. ప్రాచీన ఏడు ప్రపంచ వింతల్లో ప్రస్తుతం నిలిచి ఉన్నది పిరమిడ్స్ ఒక్కటే. ఈజిప్షియన్ పర్యాటకానికి కేంద్రం కూడా పిరమిడ్సే. మన హోటల్‌కి ఐదు నిమిషాలు దూరంలోనే గీజా ప్రాంతంలో అవి ఉన్నాయి. వీటిని ఫారోస్ కాలంలో నిర్మించారు. ఫారో అంటే వ్యక్తి పేరు కాదు. రాజు అని అర్థం. వీటిలో గ్రేట్ పిరమిడ్ ఆఫ్ గీజా పెద్దది. గీజా పిరమిడ్ కాంప్లెక్స్‌లోని మూడు పిరమిడ్స్‌లో ఇది అతి పెద్దది, అతి పురాతనమైనది. దీన్ని పిరమిడ్ ఆఫ్ ఖుఫూ, పిరమిడ్ ఆఫ్ ఛియోక్స్ అని కూడా పిలుస్తారు. ఈజిప్షియన్ ఫారో ఖుఫూ 4వ తరానికి చెందిన రాజు. క్రీ.పూ 2,560లో ఆయన కోసం దీన్ని నిర్మించారని కొందరి అభిప్రాయం. ఈ సమాధి నిర్మాణానికి పది నించి ఇరవై సంవత్సరాలు పట్టిందిట. 481 అడుగుల ఎత్తు గల ఈ పిరమిడ్ 3,800 సంవత్సరాలపాటు ప్రపంచంలో మనిషి చేత నిర్మించబడ్డ అతి ఎత్తైన నిర్మాణంగా ఉండేది. పిరమిడ్ బయటి భాగం మృదువైన రాళ్ళతో నిర్మించబడింది. అవి మాయమై ఇప్పుడు కనిపించేది అవి లేని నిర్మాణం. పునాది దగ్గర అలాంటి ఆనాటి ఫేసింగ్ స్టోన్స్ కొన్ని ఇప్పుడు చూడచ్చు.



క్లోజప్‌లో పిరమిడ్

"గ్రేట్ పిరమిడ్‌ని ఎలా నిర్మించారు? అనే అంశం మీద ప్రపంచంలో అనే థియరీలు ఉన్నాయి. పెద్ద రాళ్ళని ఓ క్వారీలోంచి తీసుకువచ్చి పైకెత్తి నిర్మించారనే థియరీని ఎక్కువ మంది అంగీకరిస్తున్నారు. ది గ్రేట్ పిరమిడ్‌కి 2 కోట్ల 30 లక్షల రాళ్ళని వినియోగించారని అంచనా. 25 నుంచి 80 టన్నుల బరువుగల వీటిని 800 కిలోమీటర్ల దూరంలోని ఆశ్వాన్ నించి తరలించారు.

"రాళ్ళల్లో చెక్క ముక్కలని సుత్తితో కొట్టి దింపి చెక్కలని

నీళ్ళలో తడుపుతారు. నీరు ఆవిరవగానే చెక్క ఉబ్బి దానికి పగులు ఏర్పడుతుంది. ఆ తర్వాత దాన్ని పగలగొట్టడం తేలిక. ప్రాచీన ఈజిప్షియన్స్ రాళ్ళని ఇలా పగలకొట్టేవారు. తర్వాత వీటిని నైలు నది మీద పడవలో ఇక్కడికి చేరవేసేవాళ్ళు. ది గ్రేట్ పిరమిడ్ నిర్మాణంలో 5 కోట్ల 50 లక్షల టన్నుల సున్నపు రాతిని, ఆశ్వాన్ నించి దిగుమతి చేసుకున్న 8,000 టన్నుల గ్రనైట్ రాయిని, 5 లక్షల టన్నుల రాళ్ళని అతికించే మోర్టర్‌ని (సిమెంట్) ఉపయోగించారని అంచనా. పిరమిడ్ నిర్మాణం పూర్తయ్యాక బయట భాగంలో బాగా పాలిష్ చేసిన తెల్లటి లైమ్ స్టోన్స్‌ని అతికించారు. క్రీ.శ 1303లో వచ్చిన పెద్ద భూకంపంలో ఇవన్నీ వదులయ్యాయి. 1356లో బహ్రీ సుల్తాన్ ఎల్ నజెరెత్ దిన్ అల్‌హసన్ వాటిని తీసుకెళ్ళి కైరో సమీపంలో ఓ కోటని, ఓ మసీదుని నిర్మించాడు.

"19వ శతాబ్దంలో మహమ్మద్ ఆలీ పాషా అమి కొన్ని రాళ్ళని తీసుకెళ్ళి గీజాకి సమీపంలోని అలబస్తర్ మాస్క్ నిర్మాణం పై భాగంలో ఉపయోగించాడు. 1830 - 1848లో పదివేల కెపాసిటీ గల ఈ మాస్క్ నిర్మాణం జరిగింది.


"తర్వాత మరికొన్ని రాలిపోయినా కొన్ని గ్రేట్ పిరమిడ్ పునాది దగ్గర నిలిచే ఉన్నాయి. దీని నిర్మాణంలో బానిసలని ఉపయోగించారని గ్రీక్స్ నమ్మేవారు. కానీ వేలకొద్దీ నిపుణులైన పనివాళ్ళు వీటిని నిర్మించారని ఆధునికలు భావిస్తున్నారు. పుల్లీలు, చక్రాలు, ఇనుపపరికరాలు లేని ఆ రోజుల్లో, బాగ పని జరిగిన రోజుల్లో 40వేలమంది, సగటున రోజుకి 14567మంది పదేళ్ళపైన పని చేసి దీన్ని పూర్తి చేసారని నమ్ముతున్నారు.


మా గైడ్ తారిఖ్

"గ్రేట్ పిరమిడ్ ప్రవేశ ద్వారం భూమికి 56 అడుగుల ఎత్తున ఉంది అందులోంచి 3.1 అడుగుల ఎత్తు, 3,4 అడుగుల వెడల్పు గల దారిలో కిందకి 345.2 అడుగులు దిగి వెళ్ళాక కింది చేంబర్ కనిపిస్తుంది. అది పూర్తి కాలేదు.

గ్రేట్ పిరమిడ్‌లో మనకి తెలిసి మూడు ఛేంబర్స్ ఉన్నాయి. రాతిని చెక్కి నిర్మించాక కింద ఉన్న ఛేంబర్‌ని నిర్మించి, దాని మీద పిరమిడ్‌ని నిర్మించారు. దీనికి పైన ఉన్న మిగిలిన రెండు ఛేంబర్లని క్వీన్స్ ఛేంబర్‌గా పిలుస్తున్నారు. ఖుఫూ గౌరవార్థం రెండు మార్చురీ (మెమోరియల్) టెంపుల్స్ కూడా నిర్మించారు. ఇక్కడ ఒకటి, ఒకటి నైలు నది ఒడ్డున మరోటి. పెద్ద పిరమిడ్ పక్కన ఉన్న మూడు చిన్న పిరమిడ్స్ ఖుఫూ భార్యలవి. ఇంకా చిన్నవి ఆనాటి ప్రముఖులకి చెందిన ఎటర్నల్ హౌస్‌లు. ఖుఫూ మొదట్లో కింద ఉన్న ఛేంబర్‌ని తన సమాధిగా ఉపయోగించాలని అనుకున్నాడని, తర్వాత మనసు మార్చుకుని పై భాగాన్ని ఎన్నుకున్నాడని భావిస్తున్నారు. లోపల పైకి, కిందకి అనేక నడక దారులు ఉన్నాయి."

అతను చెప్పే ఈ వివరాలని మేము శ్రద్ధగా వింటూంటే తారిఖ్ చెప్పాడు.


పిరమిడ్ ఎంట్రన్స్

"ఎవరూ చరిత్ర వినడానికి ఇష్టపడరు. మీది నైస్ గ్రూప్. శ్రద్ధగా వింటున్నారు. పిరమిడ్స్ ఓ సమాధి కంటే ఎక్కువ. విద్యుచ్ఛక్తిని తయారు చేయడానికి దీన్ని ఉపయోగించారని ఓ థియరీ. ఆనాటి రాజులు బాగా ధనవంతులు. కాబట్టే సాధ్యమైంది.

"నే నా పర్యాటకులకి లోపలికి వెళ్ళద్దనే సలహా ఇస్తాను. ఎందుకంటే పిరమిడ్ లోపల మొత్తం చూసే అవకాశం లేదు లోపలికి వెళ్ళిన ఐదు నిమిషాల్లో వెనక్కి రావాలి. పైగా చీకట్లో మోకాళ్ళ మీద పాకుతూ వెళ్ళాలి. చూడటానికి ప్రత్యేకంగా ఏమీ ఉండదు. నేనూ ఇంతదాకా వెళ్ళలేదు. కారణం క్లాస్ట్రోఫోబియా (ఇరుకు ప్రదేశం అంటే భయం) లోపల ఫోటోలు తీసుకునేందుకు వీల్లేదు. మోకాళ్ళ మీద పాకితే వీపు నొప్పి రావచ్చు. కానీ ఛాయిస్ మీదే కాబట్టి ఇది సలహా మాత్రమే. ఒక్కొక్కరికి ఒక్కో అభిప్రాయం ఉంటుంది. ఇది పిరమిడ్ ట్రిప్‌లో హైలెట్


సహారా ఎడారిలో పిరమిడ్స్ వైపు పయనం

కానే కాదు. దానికి సెపరేట్ టిక్కెట్ ఉంది. మనం పిరమిడ్ చేరుకునే లోగానే ఎంట్రన్స్‌లో ఆ టిక్కెట్‌ని కొనాలి. టిక్కెట్ 200 డాలర్లు. అక్కడిదాకా వెళ్ళాక టిక్కెట్ కావాలంటే రాదు. కాబట్టి ముందే నిర్ణయించుకుని నాకు చెపితే టిక్కెట్లు కొంటాను." తారిఖ్ చెప్పాడు.

మేమంతా ఆయన సలహా పాటించాం. ఆయన సూచించిన మరోటి కూడా అనుసరించాం.

"సహారా ఎడారిలోంచి పిరమిడ్స్‌ని చూడమని నేను రికమెండ్ చేస్తాను. వీటిని కట్టిన కాలంలో ఎలా కనపడేవో, అక్కడినించి అలా కనపడతాయి. పిరమిడ్స్‌కి, మీకూ మధ్య పర్యాటకులు కానీ, షాపులు కానీ అడ్డం ఉండవు. సహారా ఎడారిలోంచి పిరమిడ్లని చూడకపోతే మీ ట్రిప్ పూర్తికాదని నా అభిప్రాయం. అది భద్రమైన ప్రదేశం. ఇంతదాకా నాకు తెలిసి ఒక్క దొంగతనం కూడా అక్కడ జరగలేదు. గుర్రబ్బండికి ట్రిప్‌కి మనిషికి పదిహేను పౌండ్స్ అవుతుంది. ఒంటెల మీద కూడా వెళ్ళొచ్చు. ఐఫిల్ టవర్ ఎక్కడానికి అయ్యే ఖర్చుకన్నా ఇది చవక. నేను వేలసార్లు అక్కడినించి పిరమిడ్లని చూసాను.


సహారాలోంచి కనపడే

"పిరమిడ్స్ దగ్గర మీరు చాలా జాగ్రత్తగా ఉండాలి. పాస్‌పోర్ట్స్, డబ్బు, ఇతర విలువైనవి జాగ్రత్తగా పెట్టుకోండి. షాపుల వాళ్ళు మీతో కరచాలనం చేయాలనుకుంటే చేయకండి. మీరు కొనేదాకా మీ చేతిని వదలరు. ఎవరైనా 'మీరు అందంగా ఉన్నారు. ఫోటో తీస్తాను' అంటే కెమెరా ఇవ్వకండి. కెమెరాతో పారిపోతారు మీ టిక్కెట్ చూస్తాని అని ఎవరైనా అడిగితే, గైడ్ దగ్గర ఉందని చెప్పండి. లేదా రంగ్ రూట్‌లో వచ్చారు. వంద పౌండ్స్ చెల్లించాలని మోసపూరితంగా వసూలు చేస్తారు. బేగ్స్‌ని వదిలి ఎక్కడా తిరక్కండి తర్వాత మళ్ళీ కనబడవు. బేరం ఆడండి. పౌండ్స్ అని చెప్పి, తర్వాత కాదు డాలర్స్ అని మాయ చేస్తారు బస్‌లో మీ బేగ్స్ వదలకండి. బస్‌లో ఏం కనిపించినా పోలీసులు తీసేసుకుంటారు."

పిరమిడ్స్ ఎంట్రన్స్ ముందు బస్ దిగి మేమంతా తారిఖ్‌ని అనుసరించి మెటల్ స్కానర్ లోంచి లోపలికి వెళ్ళాం. పిరమిడ్స్ ఆవరణలోకి వెళ్ళేందుకు టిక్కెట్ 80 పౌండ్లు.

"గ్రూప్ ఫోటో తీసుకోదలిస్తే నేను వాళ్ళతో మాట్లాడతాను గ్రూప్ ఫోటోకి ఏమీ చెల్లించనక్కరలేదు. కానీ కాపీ కావాలంటే పది పౌండ్లు చెల్లించాలి. వెనకాల పిరమిడ్స్ వచ్చేలా ప్రొఫెషనల్‌గా ఫోటో తీస్తారు. ఇక్కడి షాపులు యజమానులు వ్యాపారం లేక అల్లాడుతున్నారు. వాళ్ళ దగ్గర కొంటే వాళ్ళకి ఆర్థిక మద్దతు ఇచ్చిన వాళ్ళవుతారు వాళ్ళెంత బీదవాళ్ళో నాకు తెలుసు."

తారిఖ్ ఓ ఫోటోగ్రాఫర్‌తో మాట్లాడి మా గ్రూప్ ఫోటో తీయించాక ఎవరెవరికి అవి కావాలో అడిగాడు. ముందే డబ్బు ఇవ్వక్కర్లేదని, తర్వాత బస్ దగ్గర అతను వాటిని అందచేసాక ఇవ్వచ్చని చెప్పాడు.

మా గ్రూప్ ఫోటో తీసుకున్నాక, కొందరు వాళ్ళతో వ్యక్తిగతంగా కూడా ఫోటోలు తీయించుకున్నారు. సరైన ఏంగిల్‌లో నిలబెట్టి, చెయ్యి, వేలు చాపి ఫోటోలో చూపుడు వేలితో పిరమిడ్ అంచుని తాకుతున్నట్లుగా, లేదా రెండు అరచేతుల మధ్య పిరమిడ్ ఉన్నట్లుగా వాళ్ళు నైపుణ్యంగా ఫోటోలు తీసారు. ఇలాంటి ఫోటోలు ఇటలీలోని పీసా టవర్ దగ్గర ఎక్కువగా తీస్తూండటం చూసాను.

తారిక్ మాకు పిరమిడ్ ఎంట్రన్స్ దాకా వెళ్ళి చూసి రావడానికి పావుగంట టైం ఇచ్చాడు. ఎడమ వైపు మెట్లెక్కి ఎంట్రన్స్‌దాకా వెళ్ళి ఆ అతి ప్రాచీన కట్టడాన్ని స్పర్శించి కుడివైపు నించి కిందకి దిగాం. ఎంట్రన్స్ టికెట్స్ లేకపోవడంతో లోపలికి అనుమతించలేదు. పర్యాటకులు తక్కువమంది ఉన్నారు.

తర్వాత అంతా గుర్రబ్బళ్ళు ఉన్నవైపు నడిచాం. దాదాపు ఏభై దాకా గుర్రబ్బళ్ళు కనిపించాయి. ఒంటెలు, గుర్రాల వల్ల అక్కడంతా రొచ్చు వాసన బాగ వేస్తోంది. తారిఖ్ అందరికీ బళ్ళు మాట్లాడి కుదిర్చాడు.

అంతా బళ్ళెక్కాక ఎడారిలోని తారు రోడ్ మీద బళ్ళు సాగాయి. తెల్ల యూనిఫాం లోని టూరిస్ట్ పోలీసులు అనేకమంది ఒంటెల మీద కనిపించారు. టూరిస్ట్ పోలీస్ స్టేషన్ ఒకటి కనిపించింది. హాట్ లైన్ 123 అని ఆ స్టేషన్ గోడమీద రాసి ఉంది. సహారా ఎడారిలో దాదాపు అరకిలోమీటర్ వెళ్ళాక ఓ చోట పిరమిడ్స్ వెనక భాగంలో మా బళ్ళు ఆగాయి. అక్కడ నించి మాకు దూరంగా మూడు పిరమిడ్స్ స్పష్టంగా కనిపించాయి. అవతలి వైపు నించి ఎండ పడుతూండడంతో పిరమిడ్స్ వెలుగుతూ కనిపించాయి. మా జట్కా బండి తోలే మహ్మద్ మా కెమెరా అడిగి తీసుకుని మాకు ఇందాక ప్రొఫెషనల్స్ తీసినట్లుగా మా చేతులు చాపించి ఫోటోలు తీసాడు. వాటిలో ఒకటే సరైన విధంగా వచ్చింది.


మా జట్కా బండి తోలే మహ్మద్

జోర్డాన్‌లోని పెట్రాలోలా కాక ఇక్కడ గుర్రాలని కొట్టడం లేదు. తన గుర్రం వయసు ఏడేళ్ళని, దాని పేరు మైఖేల్ అని మహ్మద్ చెప్పాడు. బండి ఖరీదు 5,500 ఈజిప్షియన్ పౌండ్స్. సొంత బండి. గుర్రాన్ని చాలా ప్రేమగా చూసుకుంటున్నాడు. బండి ఆగగానే దానికి విశ్రాంతి ఇవ్వడానికి బండినించి విప్పదీసాడు.

పావుగంట తర్వాత తిరిగి బయలుదేరాం. ఎక్కిన చోటికి చేరుకుని దిగాక మా జట్కా డ్రైవర్ మహ్మద్‌కి గుర్రం గడ్డికోసం పది పౌండ్స్ అదనంగా ఇచ్చాను. పర్యాటకులకి చాలామంది డ్రింక్, కూల్ వాటర్ అని నీళ్ళు ఇస్తారని, 'నో. థాంక్స్' చెప్పమని తర్వాత డబ్బు అడుగుతారని మా బండివాడు మహ్మద్ జాగ్రత్తలు చెప్పాడు. ఈ రకం మోసాలు ఆసియా దేశాల్లో అధిక, యూరప్, అమెరికాల్లో ఇలాంటి మోసాలు నేను ఎక్కడా చూడలేదు.

మేం బళ్ళు దిగాక స్వాగతం చెప్తూ తారిక్ చెప్పాడు.

"మీరు యుఎస్ఏలోనో, జర్మనీలోనో లేరు. పూర్ ఆఫ్రికాలో ఉన్నారు. సెల్ఫ్ ఎంప్లాయిడ్‌కి మీరు సహాయం చేసినందుకు నాకు సంతోషంగా ఉంది. మీరు ఈ రైడ్‌ని ఎంజాయ్ చేసారనే ఆశిస్తాను. మనం ఇప్పుడు గ్రేట్ స్ఫింక్స్ దగ్గరకి వెళ్తున్నాం. అది ఈజిప్ట్‌కి చిహ్నం.

తపాలా బిళ్ళలు, నాణేలు అధికారిక డాక్యుమెంట్స్ మీద ఈ బొమ్మ కనిపిస్తుంది. ఆ విగ్రహాన్ని దూరం నించి చూడాలి తప్ప, దగ్గరికి వెళ్ళి చూసే అవకాశం లేదు. దాన్ని తాకకుండా అడ్డుగా తాళ్ళు కట్టారు.''




అక్కడినించి పదిం ముప్పావుకి సమీపంలోని స్పింక్స్ దగ్గరికి చేరుకున్నాం. స్ఫింక్స్ విగ్రహానికి ముఖం ఆఫ్రికన్ ఫీచర్స్ గల మనిషి మొహం, సింహం శరీరం. గ్రీక్ సంప్రదాయంలో ఇలాంటి వర్ణన ఉంది. పురాణ కథల్లో స్ఫింక్స్ని 'దయలేని రాక్షసి'గా వర్ణించారు. మనిషి కనపడితే, అది అడిగే చిక్కు ప్రశ్నకి సరైన సమాధానం చెప్పకపోతే చంపి తింటుందని ఓడిపస్‌లో ఉంది. దీన్నే రిడిల్ ఆఫ్ ది స్పింక్స్ అంటారు. ఐతే ఈజిప్షియన్ స్ఫింక్స్ మొహం మగ మొహం. సాధారణంగా గ్రీస్‌లో సమాధులకి, ఆలయాలకి అటు, ఇటు స్ఫింక్స్ కాపలాదారులుగా కనిపిస్తాయి. ప్రపంచంలోని అతి పురాతన స్ఫింక్స్ క్రీస్తు పూర్వం 9,500 ఏళ్ళనాటిది. ఇది టర్కీలో గోబెక్లీ టెపె అనే చోట ఉంది గీజాలోని గ్రేట్ స్పింక్స్ అతి పెద్దది. అతి ప్రసిద్ధి చెందినది. ఇది గ్రేట్ పిరమిడ్స్ పక్కనే ఆగ్నేయ దిశలో ఉంది. దీన్ని ఎప్పుడు నిర్మించారో స్పష్టంగా తెలీదు. కానీ తల ఫారో కాఫ్రాది అని చరిత్రకారులు నమ్ముతున్నారు. ఇక్కడు టుట్మోస్ – 4 పేరుతో గల ఓ శిలా శాసనం క్రీ.పూ 1400కి చెందింది.

చాలామంది ఫారోస్, ఆలయం లేదా సమాధి బయట స్ఫింక్స్ తలకి నమూనాగా తమ తలని రూపొందించేవారు. ఈజిప్షియన్ సూర్యదేవత సెక్మెట్ 'యుద్ధ, చికిత్స' దేవత. ''రెండవ ఎత్తైన పిరమిడ్‌ని నిర్మించిన కాఫ్రానే స్ఫింక్స్ని కూడా నిర్మించాడని, అది కాఫ్రా మొహం అని కొందరు భావిస్తున్నారు.

ఐతే న్యూయర్క్ సిటీ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే ఫోరెన్సిక్ సైంటిస్ట్ ఫ్రాంక్ డొమింగో, స్ఫింక్స్ కొలతలని తీసుకుని కంప్యూటర్‌లో ఫోరెన్సిక్ డ్రాయింగ్స్‌తో, అది కాఫ్రా మొహం కాదని నీగ్రో మొహం అని చెప్పాడు. అందువల్ల పురాతన ఈజిప్షియన్స్ నీగ్రోలని పరిశోధకులు భావిస్తున్నారు. స్ఫింక్స్ ముఖం 66 అడుగుల ఎత్తు. శరీరం పొడవు 241 అడుగులు, ఈ మొత్తం ఒకే రాతితో చెక్కారు. ఇది లైమ్ స్టోన్ రాయి. ప్రపంచంలో ఒకే రాతితో చెక్కిన అతి పెద్ద నిర్మాణం ఇది. క్రీస్తు పూర్వం 558లో దీన్ని చెక్కారని అంచనా. ఇన్ని వేల సంవత్సరాల వేడి వాతావరణం, గాలిలోని ఇసుక రేణువుల వల్ల దీని ముఖం వికారంగా మారింది. ఇది ప్రపంచంలోని అతి పాత విగ్రహం దీనికుండా మీటర్ వెడల్పయిన ముక్కు మాయమైంది. గడ్డం కూడా. ఉలులతో వాటిని ఎవరోఎవరో తొలగించిన గుర్తులు చరిత్రకారులకి కనిపించాయి. క్రీ.శ 1378లో మహమ్మద్ సయీం అల్ దార్ అనే సూఫీ ముస్లిం, రైతులు దిగుబడి పెంచుకోడానికి స్ఫింక్స్‌కి నైవేద్యం పెట్టడం చూసి, దాన్ని విగ్రహారాధనగా భావించి, ఆగ్రహించి దీని ముక్కుని ధ్వంసం చేసాడని, తరువాత ఈ నేరానికి అతన్ని ఉరి తీసారని ఒక కథనం. మరో కథనం, నెపోలియన్ సైనికులు ఫిరంగి గుండుతో ముక్కు పగలగొట్టారని'' తారిఖ్ చెప్పాడు.



ఐతే, ఇది రాసేటప్పుడు ఇంటర్నెట్‌లో చెక్ చేస్తే, నెపోలియన్ పుట్టింది 1769లో అని, అంతకు మునుపే 1757లో డేనిష్ చిత్రకారుడు ఫ్రెడరిక్ లూయిస్ నోర్డెన్ గీసిన స్పింక్స్ బొమ్మలో ముక్కు లేకపోవడంతో ఇది కట్టుకథ అని చరిత్రకారులు భావిస్తున్నారనే సమాచారం చదివాను.

స్ఫింక్స్ నేపథ్యంలో ఫోటోలు తీసుకుని అక్కడినించి అంతా మా బస్ దగ్గరకి నడిచాం. దారి పొడవునా అటూ ఇటూ గుడారాల్లో షాపులు, వాటిలో అరబ్ దుస్తులు, అరబ్బుల తలపాగాలు - అది పెట్టుకుంటే తల చల్లగా ఉంటుందిట. హస్తకళావస్తువులు, పాత నాణాలు, ఇతర హేన్సీ వస్తువులు అమ్ముతున్నారు. బేరాలతో చాలా చిరాకు అనిపించింది. సూవెనీర్‌గా ఈజిప్షియన్ రాజు రాణి, పిల్లి మూడు చెక్క బొమ్మల సెట్‌బి పది డాలర్లకి బేరమాడకుండా కొన్నాం. అక్కడ పాపిరస్ (కాగితం) మీద గీసిన చిత్రాలని చాలామంది తిరుగుతూ అమ్ముతున్నారు. పదిహేను పౌండ్స్‌కి మూడు చిత్రాలు కొన్నాం. కొందరు షాపింగ్‌లో సహాయం చేయమని కోరినా తారిఖ్ బేరాలాడి వారి లాభాన్ని తగ్గించడానికి ఇష్టపడలేదు.

"వాళ్ళు ఎంత దరిద్రంలో మగ్గుతున్నారో నాకు తెలుసు. ఈ నిరుపేద చేతివృత్తుల వారినించి బేరమాడకుండా కొనడమే మీరు ఈజిప్షియన్స్‌కి చేసే మహోపకారం" చెప్పాడు.

అక్కడినించి 11-40కి బయలుదేరి మా తర్వాతి స్టాప్ పెర్ఫ్యూమ్ ఫేక్టరీకి ఐదు నిమిషాల్లో చేరుకున్నాం. స్ఫింక్స్ స్క్వేర్‌లోని రామ్సేస్ పెర్ఫ్యూమ్స్ పేలస్ ముందు బస్ దిగి లోపలికి నడిచాం. ముందుగా పెర్ఫ్యూం గురించి ఒకతను ఇంగ్లీష్‌లో వివరించాడు.

"ప్రపంచంలోని పెర్ఫ్యూమ్ తయారీదారులు 50 శాతం ఎసెన్స్‌ని ఈజిప్ట్‌నించే కొంటారు. మిగిలిన 50 శాతం కెమికల్స్ కలిపి ఎంత ఖరీదుకి అమ్ముతారో మీకు తెలుసు. మేము అమ్మే పెర్ఫ్యూమ్స్ సువాసన కొన్ని రోజులు పైనే ఉంటుంది. వాళ్ళు అమ్మేదానికి ఎండ తగిలితే వాసన పోతుంది. మీకు ఏ పెర్ఫ్యూమ్ నచ్చితే దానిముందు టిక్ చేయండి."

అతని సహాయకుడు మాకు పెన్సిల్స్, అతను వివరించే పెర్ఫ్యూమ్స్ పేర్లు గల బ్రోషర్‌ని ఇచ్చాడు. అందరికీ ఉచితంగా హైబిస్కస్ (మందార) జ్యూస్‌ని ఇచ్చారు.

"ఒక చుక్క ఈ పెర్ఫ్యూమ్ పది చుక్కల ఆల్కహాల్‌తో కలిపితే అది యూరోపియన్ ఫార్ములా అవుతుంది. రెండు మూడు చుక్కలని మీ స్నానం నీళ్ళల్లో కలిపితే అది బాత్ ఆయిల్ అవుతుంది. ఈ సెంట్ బాటిల్ మూత తీసి ఉంచితే మీ గదిలో పూలవాసన వస్తుంది. మేము అమ్మేది పెర్ఫ్యూమ్ కలిపిన నూనెని. దీన్ని చెవుల వెనక కానీ, జుట్టుమీద కానీ రాసుకుంటే వాసన కొన్ని రోజులపాటు ఉంటుంది. పాపిరస్ పువ్వు, తామర, మల్లె లవెండర్, వెనీలా, గులాబీ, గార్డేనియా, లిలాక్, కార్నేషన్, లిల్లీ ఆఫ్ ది వేలీ, ఆరెంజ్ బ్లాసమ్ లాంటి పూలతో చేసిన పర్ఫ్యూమ్స్‌ని అనేక రకాలుగా కలిపి అమ్ముతాం. మీకు నచ్చినవి కొనొచ్చు."

అతను ప్రతీ సెంట్ పేరు చెప్తూంటే సహాయకుడు మా అరచేతి వెనక దాన్ని పూస్తుంటే వాసన చూడసాగాం. వాటి పేర్లు సీక్రెట్ ఆఫ్ ది డిజర్ట్, క్వీన్ ఆఫ్ ఈజిప్ట్, నెఫర్‌టిటీ, స్ఫింక్స్, రామ్ సేస్, క్వీన్ క్లియోపాత్రా, సీక్రెట్ ఆఫ్ ది నైట్... ఇలా ఉన్నాయి.

"కేంజిల్, షనాల్, గూచీ, రూగో అర్మాణీ, కాల్విన్ క్లీన్ మొదలైన కంపెనీలు మానించే కొంటారు. ఇవి కాక పెర్ఫ్యూమ్‌లో వాడే నూనెలు కూడా మేం అమ్ముతాం. మస్క్, మింట్, శాండల్ ఉడ్ మొదలైన వాటినించి ఎసెన్స్ కూడా మేం తయారుచేస్తాం. కేవలం సువాసనాకే కాక చికిత్సకి కూడా ఈ ఆయిల్స్‌ని వాడచ్చు."

అతను ఇచ్చిన బ్రోషర్‌లో ఏ ఆయిల్ ఏ చికిత్సకి ఉపయోగిస్తుందో ఉంది. కొన్ని బయట వాడేవి, కొన్ని లోపలికి తీసుకునేవి.

మైగ్రేన్, తలనొప్పులకి మస్క్ రాసుకోవాలి. హై బిపికి రాయల్ ఏంబర్, లో బిపికి ఏంబర్ కాశ్మీర్ రాసుకోవాలి. లివర్, నర్వస్ సిస్టమ్‌కి మింట్ ఆయిల్ లోపలికి తీసుకోవాలి. జీర్ణశక్తికి బ్లాక్ సీడ్ ఆయిల్ కేస్టల్ ఆయిల్ (ఆముదం) రక్తంలోని నికోటిన్ స్థాయిని తగ్గించడానికి, డయాబెటిస్‌కి, పుంసత్వానికి వాటర్ క్రెస్ ఆయిల్ తాగాలి. మెంతి నూనె రెక్టమ్, యుటెరస్ కేన్సర్లకి లోపలికి తీసుకోవాలి. గాల్‌స్టోన్స్‌కి ముల్లంగి ఆయిల్ తాగాలి. ఇలాగే కేరట్, లవంగ నూనె, గుమ్మడి నూనె, బాదం నూనె, గార్లిక్ ఆయిల్, కాడ్ లివర్ ఆయిల్ ఏలకుల నూనె మొదలైనవి ఏ వ్యాధులకి వాడాలో బ్రోషర్‌లో రాసి ఉన్నాయి. అన్నీ ఖరీదుగా ఉన్నాయి. అగర్వాల్స్ ఎప్పట్లాగే ఎక్కువ కొన్నారు. బయటికి వచ్చి బస్ ఎక్కాక తారిఖ్ అడిగాడు.

"ప్రపంచంలో మొదటగా కాగితాన్ని ఎవరు కనిపెట్టారు?"

చాలామంది చైనీస్ అని జవాబు చెప్పారు.

"కాదు పేపర్ని కనిపెట్టింది ఈజిప్షియన్స్. అది పాపిరస్. దానిమీద గీసిన పెయింటింగ్స్ కేవలం ఈజిప్ట్‌లోనే అమ్ముతారు. ప్రపంచంలో మొట్టమొదటగా కనిపెట్టిన పేపర్ మీద బొమ్మలు గీసి అమ్ముతున్నారు. ప్రతీ బొమ్మా చిత్రకారులు చేత్తో గీసింది తప్ప ప్రింట్ చేసింది కాదు. ఈజిప్ట్ వచ్చిన వారంతా సాధారణంగా వీటిని సూవెనీర్స్‌గా బంధుమిత్రులకి కొనుక్కెళ్తారు. మీలో పాపిరస్ పెయింటింగ్స్ కావలసిన వాళ్ళు చేతులెత్తండి."

చాలామంది కావాలన్నారు.

అంతా అవి అమ్మే షాపుకి వెళ్ళాం. షాపు లోపల ఫొటోలు తీయకూడదని తారిఖ్ హెచ్చరించాడు.

"దీన్ని ఈజిప్షియన్స్ ఎప్పుడు కనిపెట్టారు? క్రీ.పూ 4వేల ఏళ్ళ క్రితమే ఈ పేపర్‌ని వాడినట్లు చరిత్ర చెప్తోంది. గ్రేట్ పిరమిడ్ ఆఫ్ గీజా నిర్మాణానికి చెందిన బొమ్మలు గల పాపిరస్ కాగితాలు దొరికాయి. అంతకు మునుపు? మతకు మునుపు జంతు చర్మాలని పేపర్‌గా వాడేవారు. పాపిరస్ చవక, చేయడం తేలిక కాబట్టి, చైనీస్ క్రీ.శ 1057 పేపర్ కనిపెట్టేదాకా ఈజిప్ట్‌లో దీన్నే వాడేవారు. దీన్ని ఎలా తయారు చేస్తారు? మనం ఆ షాపులో తెలుసుకుంటాం. పేపరస్ కాగితాన్ని మడవరు. చుడతారు. లేదా చిరిగిపోతుంది. పాపిరస్‌ని నేడు వంట చెరుకుగా, కంచెలుగా, పై కప్పుగా చాపలు, ట్రేలు మొదలైనవి చేయడానికి ఉపయోగిస్తున్నారు." తారిఖ్ చెప్పాడు.

షాప్ ఆవరణలోనే చాలా పాపిరస్ చెట్లు ఉన్నాయి. ఆకు సూర్యకిరణాల్లా అన్ని వైపులకి ఉండి, ఆకుపచ్చ కాండం పిరమిడ్ ఆకారంలో ఉంది. మాకు స్వాగతం చెప్పినతను ఆ చెట్లని చూపించి దాన్ని తయారు చేసే విధానాన్ని వివరించాడు. షాప్ ఫస్ట్ ఫ్లోర్‌లో ఉంది.

"కాండం చుట్టూ ఉన్న ఆకుపచ్చ బెరడుని తీస్తే, లోపల తెల్లటి కాండం ఉంటుంది. దాన్ని పేపర్‌లా పదహారు అంగుళాల పొడవున సన్నగా కోసి నీళ్ళలో వారం రోజులు ఉంచుతారు. అవి నీళ్ళలో నానాక వాటిని గట్టి ఉపరితలం మీద ఒకదాని పక్కన ఒకటి ఉంచి, ఒక దాని అంచుని మరొక దానికి తాకించి ప్రెస్ చేసి ఉంచుతారు. ఇంకా తడిగా ఉండగానే వాటిని సుత్తితో కొట్టి ఒక షీట్‌గా అతుక్కునేలా చేస్తారు. అది ఎండాక నత్తగుల్ల, రాయి లేదా గుండ్రటి చెక్కతో మృదువుగా అయ్యేలా పాలిష్ చేస్తారు. ఇలా పేపర్‌ని తయారు చేసాక, ఆఖరి పేపర్‌కి ఓ గుండ్రటి కర్రని చుట్టడానికి అనువుగా అటాచ్ చేస్తారు. ఈజిప్ట్‌లాంటి పొడి వాతావరణంలో పాపిరస్ పాడవదు. కానీ తేమ ప్రాంతంలో ఇవి పాడైపోతాయి. ఈ కారణంగా యూరప్‌లో పదేళ్ళలో పాడవుతాయి. ఈజిప్ట్‌లో రెండు వందల ఏళ్ళు పాడవకుండా ఉంటాయి. అందుకని వీటిని చెక్కపెట్టెల్లో ఉంచుతారు. ఈ కారణంగానే మా షాపులో ఏ.సి లేదు.

ఆ షాప్‌లో అనేక సైజుల్లోని పాపిరస్ మీద గీసిన అనేక బొమ్మలు ఉన్నాయి. క్వీన్ క్లియోపాత్రా, స్ఫింక్స్‌లాంటి రంగు రంగుల బొమ్మలున్నాయి. గోడకి వేలాడే ప్రతీ బొమ్మ వెనక ఓ నంబర్ ఉంది. నచ్చిన బొమ్మ నంబర్‌ని కౌంటర్‌లో చెపితే, వాడు డబ్బు తీసుకుని దాన్ని పేక్ చేసి ఇస్తాడు. వంద ఈజిప్షియన్ పౌండ్స్‌తో మేము ఒక బొమ్మని కొన్నాం.

ఒకటింపావుకి షాపులోంచి మళ్ళీ బయలుదేరాం.

"మనం లంచ్‌కి వెళితే మ్యూజియం మిస్ అవుతాం. కాబట్టి మ్యూజియం చూసుకుని లంచ్‌కి ఆలస్యంగా వెళ్దాం. మ్యూజియంలో ఫోటోలు తీసుకోకూడదు. కెమెరాలని లోపలికి అనుమతించరు. కాబట్టి బస్‌లో వదలండి" తారిఖ్ హెచ్చరించాడు.

దారిలో బస్‌లోంచి కైరో టవర్ని చూపించి తారిఖ్ చెప్పాడు. "ఇది ఈజిప్ట్‌లోని అతి ఎత్తయిన నిర్మాణం. 614 అడుగుల ఎత్తు. 1971 వరకు, అంటే, 1971లో సౌత్ఆఫ్రికాలో హిల్ బ్రో టవర్ కట్టేదాకా, నార్త్ ఆఫ్రికాలో ఏభై ఏళ్ళదాకా, ఆఫ్రికాలో పదేళ్ళదాకా ఇది అతి ఎత్తయిన కట్టడంగా ఉండేది. పిరమిడ్స్, స్ఫింక్స్ తర్వాత ఇది ఈజిప్ట్‌కి ఫేమస్ లేండ్ మార్క్. ఇది నైలు నదిలో గెజిరా ద్వీపంలో, డౌన్

టౌన్ దగ్గర ఉంది. దీనికో రాజకీయ చరిత్ర ఉంది. 1960లో ఈజిప్షియన్ ప్రెసిడెంట్ గమల్ అబ్దల్ నాసర్ అమెరికా ప్రభుత్వం తన నించి ఓ సహాయం కోరి 60 లక్షల డాలర్లని వ్యక్తిగత బహుమతిగా ఇచ్చిందని, నిజానికి అది లంచం అని, దీన్ని అమెరికన్ ప్రభుత్వాన్ని బద్నామ్ చేయడానికని చెప్పి ఆ డబ్బుని ఈ టవర్ నిర్మాణం కోసం ఇచ్చాడు. దీన్ని అమెరికన్ ఎంబసీలోంచి రోజూ కనపడే చోట నిర్మించారు. కోటిన్నర డాలర్లతో దీన్ని 2010కి ఏభైయ్యవ ఏనివర్సరీ కోసం రెనొవేట్ చేసారు. దీని మీద రొటేటింగ్ రెస్టారెంట్ ఉంది. ఇది పూర్తిగా తిరగడానికి 70 నిమిషాలు పడుతుంది. అబ్జర్వేషన్ డెక్ కూడా ఉంది. రాత్రి చూస్తే కైరో మొత్తం కనిపిస్తుంది. కాని ఇది మన ఐటనరరీలో లేదు కాబట్టి మిమ్మల్ని టవర్ మీదకి తీసుకెళ్ళలేకపోతున్నాను."

మా కోచ్ తాహ్రిర్ రోడ్‌లోని మ్యూజియం ముందు ఆగింది.

"దీనిపేరు తహ్రిర్ స్క్వేర్. దీనికి మార్టీ స్క్వేర్ అని కూడా పేరు. ఇక్కడ రాజకీయ ప్రదర్శనలు జరుగుతూంటాయి. 2011లో జరిగిన ఈజిప్షియన్ తిరుగుబాటు ఇక్కడే ఆరంభమైంది" తారిఖ్ చెప్పాడు.

పోలీసులు మ్యూజియంలోకి వచ్చే వెహికల్ నంబర్లని, డ్రైవర్ పేర్లని రాసుకుంటున్నారు.

"అటెన్షన్ ప్లీజ్. ఫుల్ అటెన్షన్! కెమేరాలు, పెద్ద బేగ్స్ బస్‌లోనే ఉంచి దిగండి. మనల్ని దింపాక బస్ పార్కింగ్‌లో ఆగుతుంది. అది ఇక్కడికి చాలా దూరం" తారిఖ్ హెచ్చరించాడు.

అంతా బస్ దిగి మ్యూజియం బయట వేచి ఉన్నాం. పర్యాటకులతో ఆ ఆవరణ కిటకిటలాడుతోంది. తారిఖ్ మా అందరికీ ఎంట్రన్స్ టిక్కెట్స్ కొనిచ్చాడు. ఒకోటి 75 పౌండ్లు. మాకు తలో వైర్‌లెస్ హెడ్ ఫోన్స్ రిసీవర్ ఇచ్చి చెప్పాడు.

"ఛానల్ 63కి ట్యూన్ చేయండి. నేను చెప్పేది వినపడని వాళ్ళు చేతులెత్తండి."

లో బేటరీవల్ల ఒకరిది పని చేయకపోతే మరొకటి తెచ్చిచ్చాడు. టికెట్స్ చూపించి అంతా లోపలికి నడిచాం.

బేగ్స్ స్కాన్ చేసే మానిటర్ ముందు కూర్చున్న ఓ సెక్యూరిటీ మనిషి టెక్స్ట్ మెసేజ్ పంపుతున్నాడు తప్ప సరిగ్గా పనిచేయడం లేదు. తారిఖ్ చెప్పేది మాకు రిసీవర్లలో వినపడసాగింది.

"ఇది చాలా పెద్ద మ్యూజియం. లక్షా ఇరవై వేల ఐటెమ్స్ ఉన్న ఈ హిస్టరీ మ్యూజియమ్‌ని గంట, రెండు గంటల్లో చూడమనడం నిజానికి నేరం. 1902లో దీన్ని ఏర్పాటు చేసారు. దీని అసలు పేరు మ్యూజియం ఆఫ్ ఈజిప్షియన్ ఏంటిక్విటీ. కానీ ఈజిప్షియన్ మ్యూజియం లేదా కైరో మ్యూజియం అని పిలుస్తూంటారు 1858లో ఓ చిన్న వేర్ హౌస్ లో దీన్ని ఆరంభించారు. 1902లో ఈ బిల్డింగ్‌లోకి మారింది. 2018 నాటికి మీ హోటల్ ఎదురుగా కట్టే పెద్ద భవంతిని పూర్తిచేసి మ్యూజియాన్ని అందులోకి తరలిస్తారు. అప్పుడది ప్రపంచంలోని అతి పెద్ద మ్యూజియం అవుతుంది. తిరుగుబాటు సమయంలో కొందరు చొరబాటు దారులు ప్రవేశించి రెండు మమ్మీలని ఎత్తుకెళ్ళారు. ఇక్కడ ఉన్న ముఖ్యమైనవి మీకు చూపిస్తాను."

తారిఖ్ మమ్మల్ని రెండు విగ్రహాల దగ్గరికి తీసుకెళ్ళి చెప్పాడు.

"ఒకటి కింగ్ టుటాన్ ఖామెన్ విగ్రహం. మరొకటి కింగ్ అఖెనాటన్‌ది. సిడర్ కలపతో చేసి బంగారు రేకుతో తాపడం చేసారు. టూటాన్ ఖామెన్ బంగారు మాస్క్ పదకొండు కిలోల బంగారంతో చేసారు."

ఖుఫూ, క్రాఫా పురాతన విగ్రహాలని చూపించాడు.

బంగారు సింహాసనం, వెనక నిలబడ్డా రాజు, రాణి విగ్రహాలు, పిరమిడ్స్‌లో దొరికిన కొందరు రాజుల బొమ్మలు ఆ విభాగంలో ఉన్నాయి. ఈజిప్షియన్ మమ్మీలని చూడటానికి ప్రత్యేకంగా టిక్కెట్ ఉంది. వెల 150 పౌండ్లు. కానీ క్యూ ఎక్కువగా ఉండటంతో మేము దానికి వెళ్ళలేదు. వారి ఆచారాల విభాగంలో గుమ్మానికి కట్టిన గుమ్మడికాయ, నులకమంచం, చాప, బుట్టలు చూస్తే మన దేశమే

గుర్తొచ్చింది. ఎత్తయిన సీలింగ్ గల చాలా పెద్ద గదులు. ఇది ఫ్రెంచ్ వారి నిర్మాణం. అద్దాల పెట్టెల్లో బంగారు విగ్రహాలు, మాస్క్‌లు అనేకం కనిపించాయి. పిరమిడ్స్‌లోని కింగ్స్ ఛేంబర్ నమూనా ఓ అద్దాల గదిలో ఉంది.

సమయాభావం వల్ల ఆ అతి పెద్ద మ్యూజియంలో వందో వంతు కూడా చూడలేకపోయాం.

మూడూ ఏభైకి అక్కడినించి హోటల్ మహారాజాకి చేరుకున్నాం. బస్‌లో మాకు పిరమిడ్స్ దగ్గర తీసుకున్న ఫోటోలు ఇచ్చి తారిఖ్ అమెరికన్ డాలర్స్ తీసుకున్నాడు. ఒకరు ఆర్డరు చేసినా తీసుకోకపోవడంతో అతని దగ్గర అది మిగిలిపోయింది. మహ్మద్ అందరి దగ్గరా గైడ్స్‌కి, డ్రైవర్స్‌కి టిప్స్ ఇవ్వడానికి రోజుకి మనిషికి నాలుగు డాలర్స్ చొప్పున కలెక్ట్ చేసాడు నేను వంద డాలర్స్ ఇచ్చాను. 34 డాలర్లు వెనక్కి ఇవ్వాలి. పౌండ్స్‌లో చిల్లర ఇవ్వబోతే అవి అవసరం లేదని, డాలర్స్‌లో కావాలని కోరాను. తన దగ్గర చిల్లర లేదన్నాడు. గైడ్ దగ్గర ఫోటోలకి ఇచ్చిన డాలర్స్ ఉన్నాయని చిల్లర మార్చమని మహ్మద్‌కి సూచించాను. కానీ అతను చిల్లర మార్చి ఇవ్వనేలేదు.

"నా దగ్గర డాలర్స్ లేవు. పౌండ్సే ఉన్నాయి" అని ఆఖరి రోజు దాకా అతను నాకు డాలర్స్ ఇవ్వలేదు. అతను తనకి అలవెన్స్‌గా ఇచ్చే ఈజిప్షియన్ కరెన్సీని డాలర్స్‌లోకి మార్చుకుంటున్నాడని నాకు అర్థమైంది. ఇది అన్యాయపు దోపిడి. అతనికి ఎంత సర్వీస్ ఉందని అడిగాను. పన్నెండేళ్ళని చెప్పాడు.

"వృధా. మీకు క్లయింట్స్‌తో ఎలా మెలగాలో తెలియదు" చెప్పి ఆఖరి రోజు నేను వంద డాలర్లు వెనక్కి తీసుకుని చిల్లర మార్చి అతనికి చెల్లించాను.

గతంలో ఎస్ ఓ టీసి గైడ్లకి, ఇతనికి స్పష్టమైన తేడాని అనుభవం ఉన్న అంతా గమనించి మాట్లాడుకున్నారు. వారందరిదీ పాజిటివ్ ఏటిట్యూడ్ ఇతనిది పూర్తిగా నెగెటివ్ ఏటిట్యూడ్ హేవ్ ఏ నైస్ డే అనే మాటలు ఫ్రెండ్లీగా అనిపిస్తాయి. ఎంజాయ్ నెక్స్ట్ ట్వంటీ ఫోర్ అవర్స్? మహ్మద్ అలా అనే రకం.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments

www.anandbooks.com
www.telugubooks.in
***ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి***